

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## ఒకటేమో హ్యూమరసం. రెండోది జీవరసం

**"చెప్పకుండా నాలుగు రోజులు పనిమానేసావేం?" అని ఓ ఇల్లాలు కోపంగా అడిగిందిట.**

"ఊరెళుతున్నానని ఫేస్‌బుక్‌లో స్టేటస్ పెట్టానుగా... అయ్యగారు I miss you అని జవాబు కూడా పెట్టారు" అందిట పనిమనిషి.



శ్రీ టి. జి.సి ప్రసాద్

లాఫ్టర్ ఈజ్ ద బెస్ట్ మెడిసిన్ అన్నారు అనుభవజ్ఞులు అలాంటి నవ్వులు పంచే రచయితలు మన తెలుగులో బాగా కరువైపోయినారు. ఇంకా మనం హాస్యం అనగానే బారిస్టర్ పార్వతీశాన్నీ, గణపతినీ వారి సృష్టికర్తల్నే స్మరించుకుంటున్నాం. వంగూరి చిట్టెన్ రాజుగారులాంటి వాళ్ళు మాత్రం ఇంకా హాస్య వ్యవసాయం చేస్తున్నారు!

ఇలాంటి సమయంలో శ్రీ టి. జి.సి ప్రసాద్ అని ఒక తెలుగు తేజం రెండు ఇంగ్లీషు పుస్తకాలతో ప్రత్యక్షమయ్యారు.

ఒక రోజు ప్రముఖ నిర్మాత శ్రీ కె.యస్.రామారావుగారు ఫోన్ చేసి "ఒక పుస్తకం పంపిస్తున్నాను. అర్జెంటుగా చదవండి.. ఇరవై ఒకటవ తారీఖు సాయంత్రం ఖాళీగా పెట్టుకోండి" అని మాత్రమే చెప్పారు.




నేను అప్పుడు చేస్తున్న పని ఆయనదే కావడం వలన దాన్ని పక్కన పెట్టి, ఆ పుస్తకాన్ని చేత పట్టాను. Along the way అనే ఇంగ్లీషు పుస్తకం. 'సుమారు నాలుగొందల పేజీలున్న ఆ పుస్తకాన్ని అర్జెంటుగా ఎలా చదవడం' అని ఆలోచించాను. కళ్ళకి విందుగా గ్రీన్ కలర్‌లో ఆక్స్‌ఫర్డ్ వారి ప్రచురణ చూడ్డానికి భలే ముద్దొచ్చింది! సరే.. అని పేజీలు తిప్పాను. నేనే నమ్మలేనంత వేగంగా నా చేత చదివించారు శ్రీ టి. జి.సి ప్రసాద్‌గారు. రెండున్నర రోజుల్లో పూర్తి చేసాను. ప్రతి నాలుగు లైన్లకి పెద్దగా నవ్వుతూ (LOL) ఆనందంగా చదివాను. ఆ పుస్తకాన్ని కౌముది పాఠకులతో పంచుకోవాలనిపించింది.

వెంకట్ అనే కుర్రాడు రాజ్, ఆదీ అనే స్నేహితులతో కలిసి కాంపస్ సెలెక్షన్స్‌లో టీ. సీ. ఎస్‌లో జాబ్ తెచ్చుకోవడంతో కథ మొదలవుతుంది. ఈలోగా అంజలి అనే హీరోయిన్, ఆమెకి శ్రీలూ అనే ఒక స్నేహితురాలు - కూడా కథలోకి ఎంటర్ అవుతారు. వెంకట్ పూర్తి పేరు వెంకట సుబ్రహ్మణ్యం ఆది శంకర తనిక బూర్ల. మిత్రులు అతన్ని vsat పిలుస్తారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఇక్కట్లూ, ప్రోగ్రామింగ్ హెడ్‌ల శాడిజాలూ, హెచ్.ఆర్.ల కుతంత్రాలూ నవ్వొచ్చేట్లు చెపుతూ ఆద్యంతం ఈ కథని తన హాస్య చతురతతో నడిపించారు ప్రసాద్‌గారు.

వెంకట్ తండ్రి సుబ్రమణ్యంగారు వరంగల్‌లో ఒక రిటైర్డ్ టీచర్. "టీ. సీ. ఎస్‌లో ఉద్యోగం వస్తే లైఫ్‌ని సేఫ్ డిపాజిట్ లాకర్‌లో పెట్టినట్లే.. ఎందుకంటే టాటాలు మన గవర్నమెంటు నడవడానికి ఎంతో ముఖ్యం.. టాటాలకి లాయల్‌గా ఉండాలి.. "అని చెపుతాడు. అంతేకాదు ప్రొద్దుటే హోమియో మెడిసిన్ వేసుకోవాలి.. అందువల్ల బౌల్ మూమెంట్ ఫ్రీగా ఉంటుంది. విరేచనం ఫ్రీగా అయితే మనసు హాయిగా ఉంటుంది. మనసు హాయిగా ఉంటే కంపెనీలో పని బాగా చేస్తావు. పని బాగా చేస్తే కంపెనీకి లాభాలొస్తాయి. కంపెనీకి లాభాలొస్తే, గవర్నమెంట్‌కి పనికొస్తుంది. అందువల్ల దేశం బాగుంటుంది. మన దేశం ముందుకెళ్తుంది. సో.. నువ్వు ప్రొద్దుటే సుఖ విరేచనం అయ్యేటట్లు చూసుకుంటే.. దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించిన వాడి వౌతావు.." అన్నది ఆయన నమ్మకం.

వెంకట్ తల్లి లక్ష్మి కూడా సత్తెకాలపు మనిషి. టీ.సీ.ఎస్‌లో జాబ్ వచ్చింది అని ఫోన్ చెయ్యగానే "ఫారెన్ ఎప్పుడు వెళుతున్నావూ? అక్కడ నుండి నాకో డిన్నర్ సెట్ తీసుకురా" అని చెపుతుంది. పాపం వెంకట్ కష్టపడి, లోన్ తీసుకుని ఒక బైక్ కొంటాడు. ఆ విషయం ఆనందంగా తల్లికి ఫోన్ చేసి చెపుతాడు. "లక్ష్మీ.. నేను బైక్ కొన్నాను. కొత్తది!" అంటాడు.

లక్ష్మి వెంటనే "కన్నా.. బైక్ బాగా ఎండగా ఉన్నప్పుడు నడపకు.. చలిలో నడపకు .. వర్షం పడేటప్పుడు నడపకు.. రోడ్డు మీద ట్రాఫిక్ ఉన్నప్పుడు నడపకు!" అని చెపుతుంటే, వెంకట్‌కి అసలు తను బైక్ ఎందుకు కొన్నాడో ఎప్పుడు నడపాలో అర్థం కాదు!

లక్ష్మి ఫోన్ చేసినప్పుడల్లా కొడుకుతో "గణపతి గుడికెళ్ళి మీ మేనేజర్ బావుండాలని కోరుకో" అంటుంది. ఆవిడ ఉద్దేశం ప్రకారం బాస్ బావుంటే, అతని మూడ్ బావుంటుంది. కొడుకికి జీతం పెరుగుతుంది. అమెరికా పంపిస్తాడు. ఇదే ఉంటుంది.

కానీ ఆ బాస్ మణి శాడిస్ట్ అనీ వెంకట్‌ని హింసలు పెడుతున్నాడనీ ఆవిడకి తెలీదు. వెంకట్ ఏం చేసినా అతనికి తప్పే! అందరికీ శాలరీ రెయిజ్ ఇచ్చినప్పుడు వెంకట్‌కీ, రాజ్‌కీ మాత్రం పెంచడు. అతనికి రాజ్ 'హిట్లర్' అని నామకరణం చేస్తాడు. వీళ్ళు 'మన హిట్లర్ ఈ రోజు ఇలా అన్నాడు.." అని ఒకరితో ఒకరు చాట్ చేసుకుంటూవుంటారు. రాజ్ క్రియేటివిటీ అంతటితో ఆగకుండా మణికి హిట్లర్ మీసం, హెయిర్ స్టైల్‌లో ఫోటో తయారు చేసి, వెంకట్‌కి పంపుతాడు.. వెంకట్ దాన్ని ఇంకో లేడీ కొలీగ్‌కి చూపించడంతో కొంప మునుగుతుంది. ఆ ఫోటో హిట్లర్ దాకా వెళుతుంది!

రాజ్ వెంకట్‌కి మంచి మిత్రుడు. వెంకట్ రాజ్‌ని కౌగలించుకున్నప్పుడు మాత్రం అతనికి తెగ చిరాకు! కానీ వెంకట్ రాజ్ కొంచెం మంచి పని చేసినా కౌగలించుకుంటూ ఉంటాడు. ఈ రాజ్‌కి ఓ ప్రత్యేకత ఉంది. సరిగ్గా అనకూడని మాట అనకూడని సందర్భంలో మాట్లాడి, వెంకట్ జీవితాన్ని ఇబ్బందులలో, కొన్నిసార్లు ప్రమాదంలో పడేస్తూవుంటాడు.

మణికి హిట్లర్ అని నామకరణం చేసారని తెలిసి, HR తన రూంలోకి పిలుస్తాడు. "మీ ఇంటెలిజెన్స్, క్రియేటివిటీ పనిలో చూపిస్తే బావుండేది. నాకూ ఏవైనా పేరు పెట్టారా? చెప్పండి ఫర్లేదు.. ఎలాగూ మిమ్మల్ని ఇంప్రూవ్‌మెంట్‌కి పంపిస్తున్నాను. ఆ తరువాత ఉంచాలో తియ్యాలో నిర్ణయిస్తాను" అంటాడు.

"ఛ. అస్సలు అలాంటిదేం లేదు. మేం మీకు ఏ నిక్‌నేమ్ పెట్టలేదు" అంటాడు వెంకట్.

"సరే.. పోండి" అని అతను అంటుండగానే, రాజ్, "పప్పూ బావుంటుంది.. పప్పూ కానీ, గుడ్డూ కానీ ఇలా గుండ్రంగా ఉన్న వాళ్ళకి పెడ్తాం!" అంటాడు.

వెంకట్‌కి నెత్తిమీద పిడుగు పడ్డట్లు అవుతుంది.

అసలే వెంకట్‌కి '7 హేబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ మీన్ మేనేజర్స్' గురించి తెలుసు! రాజ్, వెంకట్‌తో అమెరికా వెళ్ళినప్పుడు కూడా ప్రోబ్లెమ్స్ క్రియేట్ చేస్తాడు.

పర్వీందర్ అని ఆల్‌రెడీ గెస్ట్ హౌస్‌లో ఉంటున్న సర్దార్జీ వీళ్ళు వెళ్ళేసరికి ఉండడు. అక్కడున్న రమణ అనే మేనేజర్ వీళ్ళకి జాగ్రత్తలు చెప్పి గెస్ట్ హౌస్‌లో దింపి వెళతాడు.

వెంకట్ స్నానానికి వెళ్ళగానే, బయట పోలీస్ సైరన్లు వినిపిస్తాయి అతను టవల్‌తో కంగారుగా బయటకి వచ్చేసరికి పోలీస్‌లు "చేతులు పైకి పెట్టి, ఆయుధాలు ఏవైనా ఉంటే కింద పెట్టేయండి. మీరు మొత్తం ఎంతమంది ఉన్నారు?" అని అరుస్తూ లోపలికి వస్తారు. వెంకట్‌కి ఏవీ అర్థం కాదు, రాజ్‌ని "ఏమైంది?" అని అడుగుతాడు. "మన ఇండియా కోడ్ 91 నొక్కాకా గుర్‌గావ్‌కి 1413.. అని నొక్కబోతుంటే, డిస్‌కనెక్ట్ అయింది.. వీళ్ళు వచ్చారు" అంటాడు. 911 నొక్కాక వాళ్ళతో ఫోన్ మాట్లాడకుండా పెట్టేయడంతో పోలీస్‌లు వచ్చారు.

అక్కడనుండి వీళ్ళని రకరకాల ప్రశ్నలు వేసి పాస్‌పోర్ట్‌లు చెక్ చేసి హడావుడి చేసాకా, ఇంకొకతను ఆ ఇంట్లో ఉన్నట్లు తెలుస్తుంది. అతని రూంలోకి వెళ్ళగానే వాళ్ళు అదిరిపోయేట్లు గుర్రం మీద కత్తి పట్టుకున్న గురుగోబింద్ సింగ్ ఫోటో ఉంటుంది. ఈయన ఎవరు?" అని అడుగుతారు.

"He is a saint" అంటాడు వెంకట్.

"మీ దేశంలో సెయింట్స్ ఇలా కత్తి పట్టుకుని గుర్రం మీద తిరుగుతారా?" అని వాళ్ళు అడుగుతారు. "లేదు. ఫోటో అలా తీసారు. కత్తిని వాళ్ళు పూజిస్తారు" అంటాడు వెంకట్.

"అతను ఏ దేశంవాడు? పాకిస్తాన్?" అని వాళ్ళు భయంగా అడుగుతారు.

"కాదు.. పంజాబ్.. అదీ భారతదేశంలోనే ఉంది" అని వెంకట్ చెపుతాడు.

వాళ్ళు తృప్తి పడి వెళుతుండగా "పాకిస్తాన్ బోర్డర్‌లో ఉంది" అంటాడు రాజ్. దాంతో మళ్ళీ ప్రోబ్లమ్ స్టార్ట్ అవుతుంది.

వెంకట్‌కి టీ.సీ.ఎస్.లో జాబ్ రాగానే తల్లి అతను తిరుపతి వెళ్ళి గుండు చేయించుకుంటాడు అని మొక్కుతుంది. వెంకట్ వెళ్ళి గుండు గీయించుకుంటూ ఉండగా, సగం గుండు గీసిన మంగలి "ఎందుకు మొక్కుకున్నావు?" అని అడుగుతాడు." నాకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా టీ.సీ.ఎస్.లో జాబ్ వచ్చినందుకు" అని చెపుతాడు.

అతను సగం గుండుతో ఉన్న వెంకట్‌కి, తన డబ్బా లోంచి ఒక కాయితం తీసి "నా కొడుకు రెస్యూమీ.. వాడికి కూడా మీ కంపెనీలో ఉద్యోగం చూడు" అంటాడు. ఒక చేత్తో కత్తి పట్టుకుని, సగం గుండు చేసి వదిలేసిన అతని మాట వినడం ఎంతైనా ఉత్తమం అని ఆలోచించి వెంకట్ 'సరే'నంటాడు. కానీ వెంకట్ తరువాత నిజంగానే అతని కొడుకు స్వామికి తన కంపెనీలో జాబ్ వచ్చేట్లు చేస్తాడు.

అమెరికా వాళ్ళు అవుట్ సోర్స్ చేసిన ప్రోజెక్ట్ పని చేస్తుంటాడు వెంకట్. ఒకరోజు అమెరికా నుండి స్టీవ్ అనే ఫారెనర్ వెంకట్‌తో చాట్‌లోకి వచ్చి "ఎక్కడున్నావు?" అని అడుగుతాడు.

"ఈ రోజు ఇంట్లో ఉన్నాను. మాకు బంద్" అంటాడు వెంకట్.

అతనికి అర్థం కాదు "బంద్ అంటే?" అంటాడు.

"కావేరీ నీళ్ళు మేం పక్క స్టేట్‌కి ఇవ్వడానికి ఇష్టపడట్లేదు కాబట్టి ఈ రోజు ఆఫీస్‌లన్నీ షట్టర్స్ మూసేసాం" అని చెపుతాడు.

"ఇలా చెయ్యమని ఎవరు చెప్పారు?" అని స్టీవ్ ఆశ్చర్యంగా అడుగుతాడు.

"ఒక పొలిటికల్ పార్టీ వాళ్ళు బంద్ ప్రకటించారు"

"మరి మీ గవర్నమెంట్ ఏం చేస్తోంది?"

"చూస్తోంది"

"అయ్యో.. ఇలా అయితే పనంతా ఆగిపోదూ రాష్ట్రంలో? ఇంకోసారి అవకూడదని ప్రార్థిద్దాం.. అసలు ఇంతకు ముందు ఎప్పుడైనా ఇలా అయిందా?" అని బాధగా అడిగాడు స్టీవ్.

"ఆ .. అవుతూనే ఉందిగా.. వీరప్పన్ రాజ్ కుమార్‌ని కిడ్నాప్ చేసినప్పుడు నాలుగు రోజులు బంద్ చేసాం"

"వీరప్పన్, రాజ్ కుమార్‌లు ఎవరు?"

"వీరప్పన్ ఒక గ్రేట్ స్మగ్లర్.. రాజ్‌కుమార్ ఒక ప్రముఖ హీరో."

స్టీవ్‌కి ఈ సమాధానాలకి తల తిరిగిపోయింది.

"మీ దేశంలో మీరు పొరుగు రాష్ట్రం వాళ్ళు నీళ్ళు లేక అల్లాడిపోతుంటే నీళ్ళివ్వరు.. అడిగితే ఉద్యోగాలు మానేసి, షాప్స్ షట్టర్స్ మూసేస్తారు. అదీ ఒక పొలిటికల్ పార్టీ పిలుపుతో.. మీ గవర్నమెంట్ చూస్తూ కూర్చుంటుంది... స్మగ్లర్లు హీరోలని కిడ్నాప్ చేస్తారు.. మీరు మళ్ళీ వారంలో నాలుగు వర్కింగ్ డేస్ బంద్ చేస్తారు.. మేం మీకు నమ్మి అవుట్ సోర్స్ చేస్తున్నాం! ఎంత బుద్దిలేనివాళ్ళం?" అని ఫోన్ పెట్టేస్తాడు. తను చెప్పిన మేటర్‌కి అతను ఎందుకు అంతగా రియాక్ట్ అయ్యాడో వెంకట్‌కి అర్థం కాలేదు.

వెంకట్ అమెరికా వెళ్ళినప్పుడు స్టీవ్ స్ట్రిప్ బార్‌కి తీసుకువెళతాడు.." మీ దేశంలో వీకెండ్స్ కాలక్షేపానికి ఏం చేస్తారు?" అని అడుగుతాడు.

"మేం వీకెండ్‌కి కానీ వీక్ మధ్యలో కానీ 'అత్తా ఒకప్పుడు కోడలే ' అనే సీరియల్ చూస్తాం, స్టార్ ప్లస్ అనే ఛానెల్‌లో... ఎందుకంటే ఇంట్లో ఆడవాళ్ళు ఛానెల్ మార్చనివ్వరు కాబట్టి" అని చెపుతాడు వెంకట్.

కూర్గ్‌కి చెందిన అంజలి చాలా అందమైన అమ్మాయి. కాఫీకి, బ్యూటీకీ కూర్గ్ ఫేమస్ కదా! ఆమె ఫాదర్ కల్నల్ కృష్ణ. తల్లి కావేరి హవుజ్ వైఫ్. అమేయా చెల్లెలు. కల్నల్‌గారు కూతుర్ని ఐఐటి ప్రొఫెషనల్ ప్రతాప్‌కే ఇచ్చి చెయ్యాలని మనసులో నిశ్చయించుకున్నాడు. పైగా ఆయనకి క్విజ్‌ల పిచ్చి! "మోస్ట్ పాపులర్ సాంగ్ ఇన్ ది వరల్డ్ ఏదీ?" అంటాడు. వీళ్ళు ఎంతో ఆలోచించి చెప్పలేకపోతే "హేపీ బర్త్‌డే టూ యు" అని పాడతాడు. ఇదే కాదు అడుగడుగునా కెబిసిలో వేసినన్ని ప్రశ్నలు వేస్తుంటాడు.

మొత్తానికి వెంకట్‌కి అంజలిని ఇచ్చి పెళ్ళి చెయ్యనని తేల్చి చెప్పేస్తాడు.

వెంకట్ దిగులు పడుతుంటే, రాజ్, ఆదీ మళ్ళీ ఒక ఉపాయంతో వస్తారు. అదేమిటంటే.. కావేరీ ఆంటీ షారూక్ ఖాన్‌కి వీరాభిమాని కాబట్టి ఆవిడ పుట్టిన రోజునాడు షారుక్ ఆవిడకి ఫోన్ చేసేట్లు చెయ్యాలని. షారూక్ మెయిల్ ఐడీ సంపాదించడం ఐటి ఎంప్లాయీస్ కాబట్టి వీళ్ళకి కష్టంకాదు. ఆ మెయిల్‌కి వెంకట్ షారుఖ్‌కి ఉత్తరం రాస్తూ "దయచేసి నా ప్రేమ గెలవాలంటే ఈ చిన్న సాయం చెయ్యి.. మా కావేరీ ఆంటీ పుట్టినరోజు నాడు ఫోన్ చేసి విష్ చెయ్యి. మాకు పుట్టబోయే పిల్లాడికి నీ పేరు పెట్టుకుంటాం. ఈ మెయిల్ నీకు ఫార్వర్డ్ చేస్తే, మీ సెక్రెటరీ జీతం పెంచు! ఆమెకి హృదయం ఉందని అర్థం. ఒకవేళ ఆమె దీన్ని ట్రాష్‌లో పారేస్తే.. ఉద్యోగం పీకెయ్యి" అని రాస్తాడు.

షారూక్ కావేరీ ఆంటీకి ఫోన్ చెయ్యడం ఆనందంతో ఆవిడ మూర్ఛపోవడం.. హాస్పిటల్‌లో ఎడ్మిట్ అవడం అంజలి తండ్రికి ఇంకా కోపం తెప్పిస్తాయి. అది వేరే విషయం.

రచయిత ఈ నవలలో ప్రతి విషయాన్నీ హాస్యంగా ఆవిష్కరించారు. మన రాష్ట్రంలో చిరంజీవి సినిమా రిలీజ్ రోజున కటౌట్‌కి కొబ్బరికాయ కొట్టడం, ప్రసాదాలు పంచి పెట్టడం, మహేష్ బాబు ఫ్యాన్ ఒకతను ఏది అడిగినా మేటర్ మహేష్ బాబు స్టైలు గురించీ, అతని తరువాతి సినిమా గురించే మాట్లాడ్డం, ఏక్తాకపూర్ ప్రీ క్లైమాక్స్‌లు తప్ప సంవత్సరాల తరబడీ ఏ సీరియల్‌నీ క్లైమాక్స్ దాకా తీసుకెళ్ళకపోవడం గురించీ, తమిళులు అంటే కాఫీ, హిందూ న్యూస్ పేపర్, లుంగీ అనీ. మణి ఇంట్లో డిన్నర్‌కి పిలిచి వైట్ రైస్,

సాంబార్ రైస్, కోకోనట్ రైస్, కర్డ్ రైస్, ఎల్లో రైస్.. ఇలా రైస్‌లు పెడితే రాజ్ పడిన భాధ గురించీ, అంజలి డొట్ల గురించీ మనని ఎంతో నవ్విస్తారు.

ఆడమ్‌ని క్రియేట్ చేసాకా, ఈవ్‌ని క్రియేట్ చేసే మధ్యలో ఒక వింత క్రీచర్ పుట్టిందట. అది అనుమానం అట! అది పుట్టాకా ఆడది పుట్టిందని భావం!

కూర్గ్ మావనీ, తెలుగు పేరెంట్స్‌నీ ఒప్పించి పెళ్ళిచేసుకుని, బిడ్డని కనడంతో కథ ముగుస్తుంది. ఇది మీరుకూడా చదివితే తప్పక ఆనందిస్తారు అని నా నమ్మకం.




"Unusual people do things differently" ఈ పుస్తకంలో శ్రీ టి.జి.సి ప్రసాద్ 65 మంది అసాధారణ వ్యక్తుల గురించి వ్రాసారు. వీరిలో మైక్ లారీ, అజీమ్ ప్రేమ్‌జీ, మదర్ థెరిసాలాంటి ప్రముఖుల దగ్గర్నుండీ షెఫ్, సర్వీస్ బోయ్, టీచర్, నర్స్, రియల్ ఎస్టేట్ బ్రోకర్, కాఫీ షాప్ వర్కర్ దాకా ఉన్నారు.

విప్రోలో శ్రీ ప్రసాద్ పనిచేసేటప్పుడు అక్కడున్న రేవతీ కస్తూరి గురించి చెపుతూ, వస్తువులని అమ్మేసాం అని ఆనందపడడం కాదు ఆవిడ నాకు డబ్బులు వసూలు చేసుకురావడం నేర్పారు అంటారు. నిజంగానే ప్రొడక్ట్స్ అమ్మడం ఎంత కష్టమో, గవర్నమెంట్ నుండి చెక్స్ కలెక్ట్ చెయ్యడం అంతే కష్టం. అక్కడుండే బ్యూరోక్రసీ అలాంటిది!

"ప్రసాద్ చెక్ తెచ్చావా?" అంటే,

"ఇంకా ఇవ్వలేదు మేడం" అన్నారుట.

"అయితే అది మన ఎకౌంట్లో జమ అయ్యాకే ఆఫీసుకి రా" అన్నారుట ఆవిడ నవ్వుతూ. ఏ విషయమైనా నవ్వుతూ మాట్లాడడం ఆవిడ ప్రత్యేకతట!

సమీనా మహమూద్ అనే టీచర్ గురించి ప్రస్తావించారు.

తన నాలుగేళ్ళ పిల్లవాడు స్కూల్ చాలా రోజులు మిస్ చేసినందువల్ల ఫెయిల్ చేస్తున్నట్లు స్కూల్ వాళ్ళు తెలియజెయ్యడంతో ఆవిడకి ఎడ్యుకేషన్ సిస్టం బాగాలేదని అనిపించి, మాంటిస్సోరీ స్కూల్ ఓపెన్ చేసారు. భర్తపోయాక, తనకి అస్సలు తెలీని ఆయన బిజినెస్ రన్ చెయ్యడం కన్నా, తనకి ఎంతో కొంత తెలిసిన పిల్లల పెంపకం, స్కూల్ రన్ చెయ్యడం బెటర్ అన్న ఆలోచన ఆవిడ్ని టీచర్ని చేసిందంటారు!

65 ఏళ్ళ వయసులో ఆవిడ ఇంకా రోజుకి 14 గంటలు పని చేస్తూ When you want an Institution, you have to be careful about every brick that you place on the wall" అంటారుట.

ఉల్లాస్ కామత్ అనే అతని దగ్గర రచయిత అపార్ట్‌మెంట్ కొనడానికి వెళ్ళినప్పుడు ఆయన "మీకు అపార్ట్‌మెంట్ నచ్చిందా? ఇవిగో తాళాలు" అన్నారుట. ప్రసాద్‌గారూ, ఆయన శ్రీమతి సవితగారూ ఆశ్చర్యపోయి ఇంకా ఎమౌంట్ మాట్లాడనే లేదు. అంటే ఆయన నవ్వి "నా బిజినెస్ కి నమ్మకమే పెట్టుబడి. అస్సాంలో గౌహతి దగ్గర ఓ ప్లాంట్ కన్‌స్ట్రక్ట్ చేసేటప్పుడు నేను మొత్తం విమెన్ వర్కర్స్‌నే ఎంప్లాయీ చేసాను. వాళ్ళు ఓ సారి నేను వస్తుంటే "ఇక్కడ ఏక్టివిస్టులు బంద్ చేస్తున్నారు.. అల్లర్లు జరుగుతున్నాయి. రావద్దు సాబ్! మీరు బావుంటేనే ఈ వర్క్ జరుగుతుంది. మా ఫ్యామిలీలు ఫుడ్ తింటాయి' అని బతిమాలారు. నేను వెళ్ళాను. ఒకే ఒక నమ్మకంతో! ఏక్టివిస్టులతో మాట్లాడి, నేను మీ స్టేట్‌లో చాలామందికి పనిచ్చి, వాళ్ళకి సాయం చేస్తున్నాను. వాళ్ళకి బ్రతుకు తెరువు చూపిస్తున్నాను.. అడ్డుపడకండి అని! అలాగే చేసాను. వాళ్ళు నా మాట నమ్మారు. మా వర్క్‌కి అడ్డుపడలేదు. నమ్మకం ముఖ్యం" అన్నారుట.

Indian Flag in Epson Gardens అనే చాప్టర్‌లో ప్రసాద్‌గారు జపాన్ వెళ్ళినప్పుడు తనని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన ఒఖరా గురించి చెప్పారు. ఈప్సన్‌లోని మాట్సుమాటో ఆఫీస్ ముందున్న అందమైన గార్డెన్‌లో ఆయనకి రెండు జండాలు కనిపించాయట. ఒకటి జపాన్‌దీ, రెండోది భారత్‌దీ! ప్రసాద్ ఆశ్చర్యపోతే ఆయన "మీరు వస్తున్నారని మీ జెండా ఏర్పాటు చేసా అన్నారుట"

నేనేం ప్రధానినీ, మరోముఖ్యమైన పదవిలో ఉన్నవాడినీ కాదు. అయినా HR ఫంక్షన్స్ గురించి చెప్పడానికి వెళ్ళిన నన్ను ఆనందపెట్టడం కోసం మన జెండా ఏర్పాటు చేసారు. అంతే కాదు భోజనానికి వెళ్ళిన నాకు రకరకాల భారతీయ శాఖాహార వంటలు ఆశ్చర్యపరిచాయి. అవన్నీ గూగుల్‌లో సెర్చ్ చేసి, రెసిపీస్ రాసుకుని వంటవాళ్ళు తయారు చేసారుట, అని రాసారు. ఒఖారా లాంటి కార్పొరేట్ ఎంప్లాయిని ఎవరైనా మర్చిపోగలరా?

"డాష్. అంటే డా.అశోక్" అనే coopers & Lybrand లో సీనియర్ పార్ట్నర్ గురించి చెపుతూ, ఆయన చాలా సింపుల్ లీడర్‌షిప్ ప్రిన్సిపల్స్ ఫాలో అవుతారు.

పేరు గుర్తుంచుకుని ఫస్ట్ నేమ్‌తో పిలుస్తారు. సులభంగా దొరుకుతారు.

మన మనసులో ఏముందో చదవగలరు. వినియోగదారుల పక్షంగానే ఆలోచిస్తారు.

తొందరగా మనకి సంబంధించిన అనే భావన కలగచేస్తారు.

హాస్య చతురతతో మనం ఆయన్ని మర్చిపోకుండా చేస్తారు.

కంపెనీలో రిజైన్ చేసినా ఆయన టచ్‌లోనే ఉంటారు.

గోల్ఫ్‌ని ఇష్టపడే ఆయన క్లైంట్ గురించి తెలుసుకోకుండా ఆ క్లైంట్‌ని కలవరు! అని రాసారు.

కారుణ్య.జి. ఒక చార్టెడ్ ఎకౌంటెంట్. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఆవిడ ఎవరికీ ఎపాయింట్‌మెంట్ ఇవ్వదు. ఎందుకంటే ఆవిడ పిల్ల స్కూల్ నుండి వచ్చే సమయం. ఆవిడకి చాలా డిమాండ్ ఉంది. లెక్కలేనంతమంది క్లైంట్స్. కానీ ఆవిడ ప్రొఫెషన్‌లో, అంత క్లియర్‌గా ఉన్నారు. మూడు గంటల తరువాత నా పర్సనల్ జీవితం స్టార్ట్ అవుతుంది. నేను వచ్చిన కేసులన్నీ పట్టుకుని ఎప్పుడో సడెన్‌గా కళ్ళు తెరిచి నా పిల్ల పెద్దయిపోయి ఉండడం చూస్తే ఎంత మిస్ అయిపోయానో తెలుస్తుంది! ఆ బాధ నాకు ఒద్దు! అంటారుట.. డబ్బు సంపాదనలో మునిగిన ఎంత మంది ఇలా ఆలోచించగలుగుతున్నారూ?

IDC లో రాజీవ్ ప్రాఫ్ అనే ID హెడ్ ఎంత స్ట్రిక్ట్‌గా ఉండేవారో చెప్పారు. ఒక గ్రాఫిక్ కార్డ్ న్యూలాబ్ opening ceremony రోజున కావాలని ఆర్డర్ ప్లేస్ చేసారట. ప్రసాద్ ఎంత ప్రయత్నించినా టెక్నికల్ రీజన్ వల్ల అది లాస్ట్ మినిట్‌కే లభ్యం అయిందిట. అసలే ఇరిటేషన్‌లో ఉన్న రాజీవ్‌కి అది పెట్టడం వలన ఒక్కసారిగా మంటలూ, పొగలూ రావడం చూడగానే, ఏమవుతాడో అని ప్రసాద్ బెంగ పడుతున్న సమయంలో రాజీవ్ పెద్దగా నవ్వుతూ "ఓపెనింగ్స్ అప్పుడు ఇలా బాణాసంచా పేల్చడం శుభమేలే!" అన్నాడుట. ఆ మాటలో అంతటా నవ్వులు విరిసాయుట! తప్పు మానవుడి వల్ల కానప్పుడు దాన్ని చమత్కారంతో తీసుకోవడమే పరిష్కారం!

"నా పేరు శ్రీనివాస్.. గుర్తుంచుకోండి" అని చెప్పడమే అతన్ని మర్చిపోనివ్వకుండా చేసింది అంటారు ప్రసాద్. అతనొక రియల్ ఎస్టేట్ బ్రోకర్.

ప్రసాద్ ఒక స్థలం కొనాలనుకున్నప్పుడు పరిచయం అయ్యాడుట. అతనికి అస్సలు ఇంగ్లీషు రాదు కన్నడం తప్ప. కానీ అతను చూపిన శ్రద్ధా, తెలివీ ఎంతో అరుదైనవి అంటారు ప్రసాద్.

ఎన్నో స్థలాలు చూసాక ప్రసాద్ ఒక స్థలం ఫైనలైజ్ చేస్తే అతను అడిగాడుట "మీ స్వంత నిర్మాణం కోసమా? అమ్మకం కోసమా? ఒకవేళ స్వంత నిర్మాణం కోసం అయితే మీకు ఇష్టమైనట్లు కొనండి.. వ్యాపారం కోసం అయితే జనం ఇష్టపడేటట్లు ఈస్ట్

ఫేసింగ్‌లో ఉన్న ప్లాట్ కొనండి" అని అతని సలహా ఎంతో పనికొచ్చింది అంటారు ప్రసాద్. ఎవరికి తెలిసిన ఫీల్డులో వారికి మాత్రమే తెలిసిన చిట్కాలు ఉంటాయి!

ఓల్డ్ HAL ఎయిర్ పోర్ట్, బెంగుళూరులో కాఫీడే సర్వీస్ బోయ్‌తో జరిగిన ప్రసాద్ సంభాషణతో ఈ సంక్షిప్త పరిచయం సమాప్తం చేస్తాను.

టి.జి.సి.: నాకో గ్లాసు పాలు కావాలి.

బోయ్: సారీ సర్.. పాలు అమ్మలేం.

టి.జి.సి: ఎంతైనా ఛార్జ్ చెయ్యండి..

కపాచినో కాస్ట్ తీసుకోండి..

బోయ్: లేదు సార్.. అమ్మలేను.

టి.జి.సి. నువ్వు చెయ్యగలవు! ప్లీజ్.

బోయ్: రూల్స్ ఒప్పుకోవు సార్.

టి.జి.సి: పాపకి పాలు మాత్రమే కావాలి.. కాఫీపొడి వద్దు అని వెళ్ళబోతుండగా, అతను ఆపి అన్నాడు.

బోయ్: సార్.. పాలు పాపకి ఇవ్వగలను. తీస్కోండి.

ఆశ్చర్యంగా.. టి.జి.సి: ఏవని ఎకౌంట్ చూపిస్తావు? రూల్స్ ఒప్పుకోవుగా?

బోయ్: పాపకైతే రూల్స్ లేవు సార్.. మీకు వేడిగా కావాలా? గోరు వెచ్చగానా?

టి.జి.సి: గోరు వెచ్చగా.. ఎంత పే చెయ్యాలి?

బోయ్: పాపలకి ఇచ్చే పాలకి చార్జ్ చెయ్యం సార్! I am sure our company doesn't mind sir. నేను ఈ గ్లాసు ఎకౌంట్‌లో రాసి రీజన్ రాస్తాను.

టి.జి.సి: నీ పేరేంటీ?

బోయ్: అజయ్ సార్!

టి.జి.సి: థాంక్యూ అజయ్!

బోయ్: వెల్ కం సర్.

ఇలాంటి ఎంప్లాయీస్ వల్లే café coffee day 141 సిటీల్లో 950 కేఫ్‌లు తెరిచి అది ఖరీదైన కాఫీ అతి ఎక్కువగా అమ్ముడు పోయేట్లు చేస్తోంది!

ఇటువంటి సేల్స్ బోయ్‌లు మీకూ తారసపడే ఉంటారు. మీరు గుర్తు పెట్టుకున్నారా? సాధారణంగా మనకి కనిపించే వీరే అసాధారణంగా కొన్ని పనులు చేసి మనం మర్చిపోలేకుండా చేస్తారు!




అందరూ చదవాల్సిన పుస్తకం ఈ Unusual People Do Things Differently.

ఈ రెండు పుస్తకాలూ నా చేతుల మీద ఆవిష్కరింపబడడం నా అదృష్టం. నేనెవరో గూగుల్‌లో చూసి, నన్ను గెస్ట్‌గా పిలిచి నా గురించి ఎంతో మాట్లాడిన శ్రీ టి.జి.సి.ప్రసాద్ గారికి కృతజ్ఞతలు. ఈ పుస్తకం ఈ సంవత్సరం బెస్ట్ సెల్లర్‌గా నిర్ణయించబడటం మన తెలుగువారందరికీ గర్వకారణం. మన ఈ తెలుగుతేజానికి బుకర్స్ ప్రైజు రావాలని అందరం ఆకాంక్షిద్దాం.



●●●




Click here to share your comments on this serial

